నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్ : మరమ్మతుల కారణంగా చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దీప్తి తెలిపారు. ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ 11 కేవీ ఫీడర్, మార్తాండ నగర్ 11 కేవీ ఫీడర్, ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ 11 కేవీ ఫీడర్, వైశాలి నగర్ 11 కేవీ ఫీడర్, మైత్రి నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని మార్తాండ నగర్, వైశాలి నగర్, న్యూ హఫీజ్‌పేట్, ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, మైత్రి నగర్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, ఏపీజీఎస్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు.

నేడు ప్రజావాణి..

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ అధికారులు తెలిపారు. మూసాపేటలోని జోన్ కార్యాలయంలో నేడు ఉదయం 10 : 30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందన్నారు. ప్రజావాణిలో జడ్సీ అపూర్వ్‌చౌహాన్, అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని వారు ఫిర్యాదులను అందిస్తే.. పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల కార్యాలయంలో ప్రజావాణి కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీలు వంశీకృష్ణ, గంగాధర్ తెలిపారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి.(కేజీ –రూపాయలలో..) టమాట 11, వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 28, కాకరకాయ 32, బీరకాయ 38, క్యాబేజి 16, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 28, కాలీఫ్లవర్ 25, దొండ 39, చిక్కుడు 40, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 27, క్యాప్సికం 55, ఆలుగడ్డ 25, కీరా 13, దోసకాయ 18, సోరకాయ 20, పొట్లకాయ (1) 13, కందగడ్డ 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 39, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 28, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 10 నుంచి 12, పచ్చి బఠాని 85, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 100, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9:30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

'అంబేద్కర్ సూక్తులే స్ఫూర్తి'

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వివేకానంద్, దళిత సంఘాల నాయకులు

దుండిగల్, డిసెంబర్ 29 : 'నీకోసం జీవిస్తే నీలోనే నిలిచిపోతావు.. అదే జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు' అని మహానుభావుడు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన సూక్తులు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్ –1లో దళితసంఘాల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రత్న అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేడు మహిళలకు అందుతున్న రిజర్వేషన్లు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే సాధ్యమైందన్నారు. అంబేద్కర్ దూరదృష్టితో రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ – 3 ద్వారా తెలంగాణ రాష్ట్రం సాధించగలిగామన్నారు. అంబేద్కర్ గౌరవార్థం 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి వారికి సముచిత స్థానం కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటికే 16 మంది మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసి స్ఫూర్తిగా నిలిచిన అంబేద్కర్ విగ్రహాల దాత, నిజాంపేట్ దళిత సంఘం అధ్యక్షుడు మేకల నాగేశ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ ప్రెసిడెంట్ రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు ఆవుల పావని జగన్‌యాదవ్, గాజుల సుజాత, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీశ్, సాంబశివారెడ్డి, బిక్షపతి, ముత్యాలు, జలగం చంద్రయ్య, అంబేద్కర్ సంఘం గౌరవాధ్యక్షుడు కుంటపల్లి రమేశ్, అధ్యక్షుడు దాసరి మల్లేశ్, ఉపాధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి దాదిమాల సూరి, దేవరాయ యాదిగిరి, దేవరాయ మల్లేశ్ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ :సంఘాల ప్రతినిధులు సేవ, సంక్షేమానికి కృషిచేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ సూచించారు. జగద్గిరిగుట్ట పోతులూరి వీరబ్రంహేంద్రస్వామి క్యాలెండర్ క్యాంప్‌ఆఫీస్‌లో ఆవిష్కరించారు. ఆలయ ప్రతినిధులు హనుమంతుచారి, మహేంద్రచారి, తిరుపతిచారి, తాటికొండ శ్రీశైలం, శివరాములు, రమణాచారి, సదనాంద్, రత్, మధు, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

– మాణిక్యనగర్ వెల్ఫేర్ అసోషియేషన్ క్యాలెండర్ ఎమ్మెల్యే ఆవిష్కరించగా సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధే లక్ష్యం



సూరారం కాలనీలో బోర్‌డ్రిల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలత

జీడిమెట్ల, డిసెంబర్ 29 : కాలనీల అభివృద్ధే తన లక్ష్యమని సుభాష్‌నగర్ కార్పొరేటర్ జి.హేమలత సురేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూరారం కాలనీలో రూ.11 లక్షలతో బోర్‌డ్రిల్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధితో పాటు పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తానన్నారు. ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సహకారంతో పార్కు, వాకింగ్ ట్రాక్, బోర్ డ్రిల్ పనులకు జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. డివిజన్‌లోని అన్ని పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగించుకునేలా చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి శివాజీ, సీనియర్ నాయకులు పందిరి యాదగిరి, మహిళా అధ్యక్షురాలు మంగ, ప్రధాన కార్యదర్శి పద్మావతి, వరలక్ష్మి, స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు, సాయి, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, తిరుపతి, విజయ్, ప్రభాకర్, రాజుగౌడ్, జహంగీర్, పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక



ట్రయల్స్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్, డిసెంబర్ 29 : అరుంధతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏయిమ్స్) క్రికెట్ గ్రౌండ్‌లో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ క్రికెట్ ఎంపిక ట్రయల్స్ ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సెలక్షన్ ట్రయల్స్ విశ్వవిద్యాలయ క్రికెట్ జట్టు ఏర్పాటులో ముగిశాయి. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఏయిమ్స్ చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి హాజరయ్యారు. ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని, ఏయిమ్స్ విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఏయిమ్స్ ఫౌండర్ సెక్రటరీ మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏయిమ్స్ డైరెక్టర్ మర్రి ధీరెన్ రెడ్డి, డీన్ ఉదయ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డా.వెంకట్ పాల్గొన్నారు.

పబ్‌లు తనిఖీ చేసిన పోలీసులు

మాదాపూర్ : బార్లు, పబ్‌ల తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు

కుత్బుల్లాపూర్ :నూతన సంవత్సర నేపథ్యంలో తనిఖీలు చేపడుతున్నట్టు పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు పబ్‌లు, అనుమానాస్పద వ్యక్తులను ఆదివారం పరిశీలించారు. పబ్‌ల నిర్వహణ, లైసెన్స్‌లు పరిశీలించారు. కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎస్ఓటీ సిబ్బంది, పేట్‌బషీరాబాద్ పోలీసులు పాల్గొన్నారు.

మాదాపూర్, డిసెంబర్ 29: నూతన సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని మాదాపూర్ పోలీస్‌లు శనివారం అర్ధరాత్రి పలు చోట్ల బార్లు, పబ్‌లపై తనిఖీలు చేపట్టారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో సిబ్బందితో పాటు ఎక్సైజ్ సిబ్బందితో కలిసి 10 పబ్‌లను తనిఖీ చేశారు. 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని పరీక్షలు చేయగా నెగిటివ్‌గా తేలింది. తనిఖీల్లో ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సిబ్బంది, డాగ్ స్క్వాడ్స్, ఎక్సైజ్ ఎస్సై, టీఎస్ నాబ్ ఇన్‌స్పెక్టర్, మాదాపూర్ సిబ్బంది పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ : తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు

జీహెచ్ఎంపై దాడికి నిరసనగా..

షాపూర్‌నగర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

దుండిగల్ : ప్రభుత్వ పాఠశాల గెజిడెట్ హెడ్మాస్టర్ రాములుపై దాడికి నిరసనగా సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం షాపూర్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ.దేవదానం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్ఎం) కంబలపల్లి రాములు డ్యూటీలో ఉన్నప్పుడు అయ్యప్పమాల వేసుకున్న 9వ తరగతి విద్యార్థికి కాలు తగిలించాడని దాడులకు పాల్పడడం అమానుషం అని వాపోయారు. కార్యక్రమంలోసీఐటీయూ కుత్బుల్లాపూర్ మండలాధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్, కే శీను, డి.కరుణాకర్, బి.నర్సింలు, కే బీరయ్య, గోపాల్, మధు, షఫీ, ఖలీల్ పాల్గొన్నారు.

బాలానగర్ డివిజన్ రెడ్డి సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జిరిగింది. సమావేశంలో సభ్యులు దొంతిరి సోమిరెడ్డిని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి నూతన అధ్యక్షుడు సోమిరెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

- అల్లాపూర్

ముగ్గుల పోటీలతో.. సృజనాత్మకత



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేయర్ నీలాగోపాల్‌రెడ్డి

దుండిగల్, డిసెంబర్ 29 : ముగ్గుల పోటీలతో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి, 4వ డివిజన్ ప్రగతినగర్‌లో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీకు మేయర్ నీలాగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, విజేతలకు మేయర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సుబ్బు, చంద్రశేఖర్, శివకుమార్, మహమ్మద్, మహేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రావు, చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి, అంజద్, ఆంజనేయవర్మ, భాస్కర్, శ్రీధర్, స్థానికులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

శేరిలింగంపల్లి : ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో 35 కాలనీల్లోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం

మల్కాజిగిరి, డిసెంబర్ 29: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్‌లోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథ ఆలయ అభివృద్ధికి రూ.2లక్షల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, అలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

చిక్కడపలి : సావిత్రి బాయిపూలే ఉపాధ్యాయ రత్న, స్వామి వివేకానంద నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2025 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ తెలిపారు. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, కుల, మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిని సావిత్రిబాయి అని అన్నారు. జనవరి 3న ఆమె జయంతితోపాటు మహోతన్నత ఆధ్యాత్మిక తత్వవేత్త స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులకు సమాజ సేవకులకు ఇతర రంగాల ప్రముఖులకు సావిత్రిబాయి ఉపాధ్యాయ రత్న, స్వామి వివేకానంద నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డును జనవరి 12న ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జనవరి 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని , వివరాలకు 96523 47207లో సంప్రదించాలని సూచించారు.

రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం

తెలుగు యూనివర్సిటీ : రతన్ టాటా స్వయం కృషితో ఎదిగి పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలవడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా మార్గదర్శకంగా నిలిచారని వక్తలు అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో రతన్‌టాటా 86వ జయంతి సందర్భంగా పలువురు బిజినెస్ మేనేజ్‌మెంట్ రంగంలో సేవలందిస్తున్న పలువురు ప్రొఫెసర్లకు రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రతన్‌టాటా జీవిత చరిత్రపై నగరంలోని పలు ఎంబీఏ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను అందజేశారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం, ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ పాల్గొని రతన్‌టాటా జీవిత విశేషాలను వివరించి స్ఫూర్తి నింపారు. ప్రముఖ ఇంద్రజాలికుడు డాక్టర్ ఎల్.ఎన్. రాజు నిర్వహించిన మ్యాజిక్ షో అలరించింది. కౌన్సిల్ కార్యదర్శి ఇట్టా ఉదయశ్రీ, ప్రోగ్రాం చీఫ్ కో ఆర్టినేటర్ డాక్టర్ రవితేజ. మేఘన, మీనాక్షి, హేమంత్ పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి పాల్పడుతున్న యజమాన్యాలు

యూనియన్ అధ్యక్షులు చింతల నాగరాజు ను కలిసిన కంపెనీల జనరల్ సెక్రటరీలు

జీడిమెట్ల : కంపెనీ యజమాన్యాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని కార్మిక నాయకుడు, యూనియన్ అధ్యక్షుడు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికుల ప్రాణాలకు భద్రత కరువైందని పలు కంపెనీల జనరల్ సెక్రటరీలు ఆదివారం చింతల నాగరాజు నివాసంలో కలిశారు. వారు మాట్లాడుతూ.. కంపెనీ యజమాన్యాలు సెఫ్టీ ప్రికాషన్స్ పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు వివరించారు. నాగరాజు మాట్లాడుతూ.. కార్మికుల ప్రాణాలు అంటే కంపెనీ యజమాన్యాలకు లెక్క లేదన్నాని.. ప్రమాదాలు జరిగినప్పుడు తూ..తూ.. మంత్రంగా కార్మికుల పరిహారం ఇస్తూ చేతులు దులుపుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యాలు భద్రత విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా అన్ని సెఫ్టీ ప్రికాషన్ తీసుకుంటే కార్మికుల ప్రాణాలను కాపాడుకోగలగుతామన్నారు. ఇప్పటికైనా యజమాన్యాలు భద్రత విషయంలో సీరియస్‌గా ఉండాలని కార్మికులు తరచుగా ప్రమాదాలు జరగడం వలన భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరుగకుండ కంపెనీ యజమాన్యాలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. - కొండాపూర్

నిబంధనలకు తూట్లు..జోరుగా అక్రమ నిర్మాణాలు

ఫిర్యాదులు చేసినా పట్టించుకోని యంత్రాంగం

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 29 : హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నారు. కాలనీలో 88 గజాల ఎల్ఐజీ ప్లాట్‌లో 6 అంతస్థులు నిర్మిస్తూ .. టౌన్‌ప్లానింగ్ అధికారులకు సవాల్ విసురుతున్నారు. కాలనీలో భవన నిర్మాణాల కోసం తీసుకున్న అనుమతులకు.. చేస్తున్న నిర్మాణాలకు పొంతన ఉండటం లేదు. రెండు, మూడు అంతస్థులు నిర్మించేందుకు అనుమతులు తీసుకుని.. ఆరు, ఏడు నిర్మాణాలు చేస్తున్న జీహెచ్ఎంసీ యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలనీలో ఓ నిర్మాణ దారుడు ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకుని... కమర్షియల్ భవనాలను కట్టేస్తున్నారు. ప్రైవేట్ హాస్టళ్ల కోసం... వైద్యశాల కోసం... అద్దెల కోసం నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలపై కాలనీ వాసుల నుంచి ఫిర్యాదులు వచ్చిన జీహెచ్ఎంసీ యంత్రాంగం వాటిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇవిగో అక్రమ నిర్మాణాలు..

- కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో ఓపెన్ ప్లాట్స్ నం. 66,67లో 544 గజాల స్థలంలో జీ ప్లస్ 5 అంతస్థుల నిర్మాణానికి అనుమతి తిసుకుని.. జీ ప్లస్ 6 అంతస్థులతో పాటు పెంట్‌హౌస్ నిర్మాణం చేశారు.
- కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని ప్లాట్ నం.ఎల్ఐజీ 563,564 ప్లాట్‌లలో 88 ప్లస్ 88 కలిపి 176 గజాల స్థలంలో రెండు అంతస్థులు నిర్మించేందుకు అనుమతులు తీసుకుని.. ఐదు అంతస్థులపైన పెంట్‌హౌస్ నిర్మాణం చేస్తున్నాడు.
- కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని ప్లాట్ నెంబర్ ఎల్ఐజీ 475లో 88 గజాల స్థలంలో ఎన్ ప్లస్ 2 అంతస్థులకు అనుమతులు తీసుకుని ఏకంగా..5 అంతస్థులతో పాటు పెంట్‌హౌజ్‌ను నిర్మాణం చేశారు.
- కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని ప్లాట్ నం.ఎల్ఐజీ 441లో 88 గజాల స్థలంలో ఎన్ ప్లస్ 2 అంతస్థులకు అనుమతులు తీసుకుని ఏకంగా..5 అంతస్థులు నిర్మాణం చేశారు.

అడ్డుకట్ట వేసేదేవరు..?

అక్రమ నిర్మాణాలు కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోనే కాదు.. మూసాపేట సర్కిల్‌లోని కాలనీ 1,2,6,9,15వ ఫేజ్‌లు, గోపాల్‌నగర్, వసంతనగర్ కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాల్లో సాగుతున్నాయి. ఈ నిర్మాణాలను ఆదిలోనే గుర్తించి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు అమ్యామ్యలకు అలవాటు పడి.. అక్రమ నిర్మాణాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. గత ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను అరికట్టే దిశగా తీసుకోచ్చిన టీఎస్ బీపాస్ చట్టంలోని లోసగులను ఆసరాగా చేసుకుని భవన నిర్మాణదారులు యదేచ్ఛగా నిర్మాణాలు చేస్తుంటే...ఈ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన న్యాక్ ఇంజినీర్లు, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్, ఏసీపీ, సర్కిల్ డీసీలు సకాలంలో చర్యలు తీసుకోవడం లేదు. జడ్సీ, నోడల్ ఆఫీసర్ పర్యవేక్షణలో పనిచేసే ఎస్‌టీఎఫ్ టీమ్‌లు పనిచేయడం మానేశాయి. మరోవైపు జోనల్, సర్కిల్ ఉన్నతాధికారుల పేరుచెప్పి.. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, టీపీఎన్‌లు బిల్డర్స్‌తో మాట్లాడుకుని..అక్రమ నిర్మాణాలకు సహకారాన్ని అందిస్తున్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలపై పదేపదే ఫిర్యాదులు వస్తే వాటిని సీజ్ చేస్తున్నారు. కానీ..ఆ నిర్మాణాదారుడు జీహెచ్ఎంసీ సీజ్‌ను తొలగించి పనులు కొనసాగించిన క్రిమినల్ కేసులు నమోదు చేయడం లేదు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి..అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో విఫలమవుతున్నా.. అధికార యంత్రాంగంలో భాగస్తులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం..

జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం.. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నాం. అనుమతులకు మించి.. నిబంధనలు అతిక్రమించి నిర్మించిన నిర్మాణాలను గుర్తిస్తాం. కాలనీలలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు పరిశీలిస్తున్నాం. నిబంధనలు అతిక్రమించి నిర్మించిన నిర్మాణాలకు నోటీసులు అందిస్తున్నాం. అక్రమ నిర్మాణం అపకుంటే.. ఆ బిల్డింగ్‌ను సీజ్ చేస్తాం. కొన్ని ప్రాంతాల్లో సీజ్ చేసిన నిర్మాణం కొనసాగిస్తే.. క్రిమినల్ కేసులను నమోదు చేశాం. భవన నిర్మాణదారులు నిబంధనలు పాటించాలి.లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

- గణపతి, నోడల్ ఆఫీసర్, జోనల్ సీపీ, కూకట్‌పల్లి